నాగరాజుపేటలో తెల్లవారుజామునే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్



ఒక్కరోజు ముందే పింఛన్ల సంబరం

● ఉదయం 5-30 గంటలకే పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

కడప (కలెక్టరేట్ / ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 31: జిల్లాలోని అవ్వాతాతలకు ఒక్కరోజు ముందే పింఛన్ల పండగ వచ్చింది. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో శనివారమే పింఛన్లు అందజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు శనివారం తెల్లవారుజామున 5-30 గంటలకు కడప నగర పరిధిలోని నాగరాజుపేట 23 వ వార్డులో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ లోతేటి శివశంకర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? సచివాలయంలో సేవలు అందిస్తున్నారా? మీ ఆరోగ్యం బాగుందా? ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం సక్రమంగా అందుతోందా అంటూ లబ్ధిదారులను కలెక్టర్ ఆరా తీశారు. ఇందుకు లబ్ధిదారులు స్పందిస్తూ అధికారులు పథకాల లబ్ధిని అందిసున్నారని, సచివాలయం, వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందనే భరోసా ఇస్తూ బండి జయలక్ష్మి, షేక్ జిలానీ, సయ్యిద్ ఖుర్షీదు తదితర లబ్ధిదారులకు రూ.4 వేల చొప్పున పెన్షన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీయే పీడీ ఆనంద్ నాయక్, మున్సిపల్ కమిషనర్ వైవో నందన్, సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రాకేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

95.52 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లావ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 95.52 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో 2,63,283 పింఛన్లు ఉండగా, శనివారం 2,51,483 పింఛన్లను పంపిణీ చేశారు. పింఛను పొందని వారు సోమవారం తీసుకునే అవకాశాన్ని అధికార యంత్రాంగం కల్పించింది. రాష్ట్రంలోని జిల్లాలవారీగా పింఛన్ల పంపిణీలో కడప జిల్లాకు 9వస్థానం లభించింది. వర్షం కారణంగా చాపాడు మండలం, మైదుకూరులలో ఉదయం 8.30 వరకు పింఛన్ల పంపిణీ మొదలు కానట్లు సమాచారం.

పులివెందులకు చేరుకున్న జగన్



ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

పులివెందుల, ఆగస్టు 31: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం రాత్రి పులివెందులకు చేరుకున్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన శనివారం కడపకు వచ్చారు. అక్కడ నుంచి వల్లూరు, పెండ్లిమర్రి మీదుగా రాత్రి 8.50గంటల ప్రాంతంలో పులివెందులలోని తన ఇంటికి చేరుకున్నారు. వైఎస్ వర్ధంతిని పురస్కరించుకుని జగన్ జిల్లాలో మూడు రోజుల పర్యటనకు వచ్చారు. ఆదివారం పులివెందులలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆదివారం అందుబాటులో ఉంటారని వైసీపీ వర్గాలు వెల్లడించాయి. 2వ తేదీ సోమవారం ఇడుపులపాయకు వెళ్లి వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఆయన తిరిగి తాడేపల్లెకు వెళ్లనున్నారు.

నేడు జిల్లాకు వైఎస్ షర్మిలారెడ్డి

కడప(కలెక్టరేట్), ఆగస్టు 31:. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదివారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ కార్యాలయానికి సమాచారం అందింది. ఆమె ఆదివారం సాయంత్రం 4 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గానా బయలుదేరి ఇడుపులపాయ ఎస్టేట్‌కు వెళతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 2వ తేదీ సోమవరం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ ఘాట్‌లో తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నివాళులు అర్పిస్తారు. అనంతరం రెండురోజుల పాటు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మధు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగో విడత కౌన్సెలింగ్

వేంపల్లె, ఆగస్టు 31: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో అడ్మిషన్ ప్రక్రియ శనివారం ముగిసింది. నాలుగో విడతలో 210సీట్ల భర్తీకి 1:2 ప్రకారం విద్యార్థులను పిలిచారు. వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ప్రక్రియ ఆలస్యమైంది. పూర్తయ్యే వరకు ప్రక్రియను ఆదివారం కూడా కొనసాగిస్తామని కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మొత్తం 4400సీట్లు భర్తీ అయ్యాయి. డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవినీతి అనకొండ

● ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో.. రూ.కోట్ల దందా
● టౌన్‌ప్లానింగ్‌లో ఏకఛత్రాధిపత్యంగా దోపిడీ
● గతంలో ఏసీబీకి దొరికినా మారని తీరు
● సిబ్బందిని సైతం టార్చర్ పెట్టిన సైకో
● అడ్డగోలుగా బిల్డింగ్ అనుమతులు
● వైసీపీ అండతో చక్రం తిప్పిన వైనం
● కూటమి ప్రభుత్వంలోనైనా వేటు పడేనా



వైఎంఆర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్ట్ మెంట్

ప్రొద్దుటూరు, ఆగస్టు 31: వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఒక హక్కుగా మారింది. దీంతో కొందరు ఉద్యోగులు స్కాంలు కబ్జాలతో పాటు ఏకంగా నేర సామ్రాజ్యమే నడిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీని ఛీకొట్టి చంద్రబాబు నేతృత్వంలోని కూటమిని అధికారంలోకి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఒక అనకొండ మాత్రం ఎలాంటి జంకుగొంకు లేకుండా నిరాటంకంగా తన అవినీతి దందాను కొనసాగిస్తున్నాడు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో తన కింది స్థాయి అధికారులను పనిచేయనీయకుండా అందరినీ తన సైకో విధానంతో తరిమేసి ఏకఛత్రాధిపత్యంగా ఐదేళ్లుగా చక్రం తిప్పుతున్నాడు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌ను అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా.. ప్రొద్దుటూరును అక్రమ కట్టడాలకు నిలయంగా మార్చివేశాడు.

ఏసీబీకి దొరికినా మారని తీరు

ఈ అవినీతి అధికారి గతంలో నెల్లూరులో ఏపీబీకి దొరికాడు. ఆ కేసు నుంచి ఇంకా పూర్తిగా బయట పడలేదు. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న ఇతనికి తిరిగి నాన్‌ఫోకల్ కింద ఆర్డర్ ఇచ్చారు. దీంతో ప్రొద్దుటూరుకు 2018లో ఏసీపీ ట్రాన్స్‌పోర్టు ప్లానర్‌గా వచ్చాడు. వచ్చినప్పటి నుంచి అప్పటి మరో ఏసీపీ, టీపీవో, టీపీఎస్‌లతో ఎప్పుడూ వాగ్వాదం చేస్తూ ఉండేవాడు. 2021 జూన్‌లో ఇతన్ని భరించలేక పంపించి వేశారు. అతను చిత్తూరు వెళ్లిపోయాడు. ఏడాది తిరగకముందే 2022 జూన్‌లో ఏసీపీగా వచ్చాడు. తన తోటి మహిళా ఏసీపీని మహిళా టీపీవోను వేధించాడు. వైసీపీ నాయకుల అండతో ఏకంగా మహిళా ఏసీపీని డమ్మీ చేసి మొత్తం అన్ని వార్డులు తనకు కేటాయించుకుని ఫోకల్ విధులు నిర్వహించాడు. వారిద్దరు ఇతన్ని వేదింపులు భరించలేక ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లి పోయారు. అప్పటి నుంచి దాదాపు 500 పైగా అక్రమ కట్టడాలకు తన హయాంలో అనుమతులు ఇచ్చాడు. ఇందులో 400 అక్రమ కట్టడాలు కాగా 150 ప్లానుకు విరుద్ధంగా కట్టారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో అప్పటి కమిషనర్ రాధకు, వైసీపీ ఎమ్మెల్యేకు భారీగా ఆదాయం సమకూర్చి పెట్టాడని ఆరోపణలున్నాయి. అందుకే అతను మహిళా ఏసీపీ, టీపీవోలను వేధింపులకు గురిచేసినా పట్టించుకోకుండా ఆదాయమే పరమావధిగా ప్రోత్సహించటంతో. అతడు అవినీతి అనకొండగా తయారయ్యాడని చెబుతారు.

నోటీసులు తప్ప చర్యలు శూన్యం

అక్రమ కట్టడాలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు, కౌన్సిల్లో వైసీపీ కౌన్సిలర్లే అక్రమ కట్టడాలపై ఆరోపించినప్పుడు మాత్రమే ఆ కట్టడాలకు కంటి తుడుపు చర్యగా నోటీసులు ఇచ్చి మమ అనిపిస్తాడు. దీంతో ప్రొద్దుటూరులో అక్రమ కట్టడాలపై స్వయంగా వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లే కౌన్సిల్లో ఆ ఏసీపీపై అనేకమార్లు ఆరోపించారు. అతని అవినీతి గురించి బహిరంగంగా వెల్లడించినా ఏ మాత్రం జంకకుండా తను అనుకున్నదే చేసుకుంటూ వచ్చాడు. వైసీపీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు అతను ఫోన్ కూడా ఎత్తడని అనేకసార్లు ఆరోపించారు. కేవలం వైసీపీ ఎమ్మెల్యేకు, ఆయన బావమరిదికి మాత్రమే అతను జవాబుదారిగా ఉండేవాడని, కనీసం కమిషనర్ కూడా అతనిపై చర్యలు తీసుకోలేని దుస్థితిలో ఉండేవారని అంటారు.

వైసీపీ అండతో చక్రంతిప్పిన వైనం

వైసీపీ ఐదేళ్ల కాలంలో నాలుగేళ్లు అతని అవినీతి దందా సాగింది. అక్రమ కట్టడాల దందాలో కోట్ల రూపాయలు కూడగట్టాడని ఆరోపణలున్నాయి. ప్రొద్దుటూరులోనే రెండు ఇళ్లు సైతం కొనుగోలు చేశాడని కార్యాలయ వర్గాలే చెబుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఔట్ సోర్సింగ్ కింద పనిచేసే ఐదుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లను వేరే సెక్షన్‌లకు పంపించి వేశాడు. కేవలం ఒకే ఒక్కడిని మాత్రం తన అనుచరుడిగా పెట్టుకుని అతని ద్వారానే పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అతని అసిస్టెంట్‌గా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి జీతం రూ.15,000. ఇతనే రూ.కోటికి పైగా అక్రమంగా సంపాదించి ఉంటాడని, లక్షలు వెచ్చించి సొంత ఇల్లు కడుతున్నాడని కార్యాలయ వర్గాల్లో చర్చనడుస్తోంది. అంటే అసిస్టెంటే కోటికి పైగా సంపాదించి ఉంటే.. ఏసీపీ లేరు, టీపీఎస్ లేరు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు లేరు.. వీరందరి వాటాలన్నీ అవినీతి అనకొండ ఒక్కడే వసూళ్లు చేసుకున్నాడంటే ఎన్ని కోట్లు సంపాదించి వుంటాడో స్పష్టమవుతోంది.

అతను వసూళ్లు చేసిన మొత్తాలు

శ్రీరాముల పేటలో కట్టిన ఒక అక్రమ కల్యాణమండపంలోనే రూ.5 లక్షలకు పైగా వసూలు చేశాడు. ఆ కల్యాణ మండపం పక్కనే కడుతున్న మరో భారీ షాపింగ్ కాంప్లెక్సులో రూ.15 లక్షలు వసూలు చేశారని ఆరోపణలున్నాయి. మైదుకూరు రోడ్డులోని ఒక పెద్ద లాడ్జీకి రూ.5 లక్షలు వసూళ్లు చేశాడు. గాంధీరోడ్డు సుందరాచార్యుల వీధిలో ఇటీవల ప్రారంభం అయిన పెద్ద లాడ్జీ కమ్ హోటల్‌కు రూ.5 లక్షలు, కొవ్వూరు గ్యారేజీ వెనుక ఉన్న ఒక కార్పొరేట్ స్కూలుకు రూ.5 లక్షలు. వైఎంఆర్ కాలనీలోని కొన్నిఅపార్ట్ మెంట్లకు ఏకంగా ఒక్కొక్క దానికి రూ.10లక్షల నుంచి రూ. 15 లక్షలకు పైగా వసూలు చేశాడు. మరో బ్యాంకు కట్టడానికి రూ.2.5 లక్షలు, ఎర్రగుంట్ల రోడ్డులోని పూర్తిగా అక్రమ నిర్మాణమైన ఒక ప్లాజాలో పెద్ద ఎత్తున వసూలు చేశాడని సమాచారం. ఐదు సెంట్లకు పైగా ఇంటి నిర్మాణముంటే చాలు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తాడు. అలాగే వీధుల్లో ఇంటికి పర్మిషన్ తీసుకోని షాపురూములు కట్టే వారివద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటాడు. అతను సాగించిన అక్రమ వసూళ్ల చిట్టా పెద్ద చాంతా డంత ఉంటుందని మున్సిపల్ ఉద్యోగులే కథలు కథలుగా చెబుతుంటారు. ఆ అధికారి నేరుగా ఫోన్ పేలో కూడా అక్రమ కట్టడాలకు వసూళ్లు చేశాడని కౌన్సిల్లోనే చర్చజరిగింది. కానీ ఇంత వరకు అతనిపై అధికారులు కానీ పాలకమం డలి కాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

కూటమి ప్రభుత్వంలోనైనా వేటు పడేనా

కూటమి ప్రభుత్వం వచ్చినా అతని వసూళ్ల దందా ఆగింది లేదని చెబుతున్నారు. మూడు నెలల్లో మూడుసార్లు జరిగిన కౌన్సిల్ సమా వేశాల్లో కూడా అతని అవినీతి ప్రస్తావన లేని సమావేశం లేదంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ప్రతి సమావేశంలో కౌన్సిలర్లే అతని అవినీతిపై విమర్శించని రోజులేదు. కూటమి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సైతం ఏసీపీ అవినీతిపై కౌన్సిల్లో వింటున్నారు. కానీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అతని హయాంలో సాగించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయలేదు. అతనితోనే అక్రమ కట్టడాలు తీయిస్తానని చెప్పడమే కానీ అతనితో ఏ పని చేయించలేదు. రేపో మాపో అతనే ఇక్కడి నుంచి చల్లగా జారుకునే అవకాశం ఉంది. బదిలీపై వెళ్లిపోతే అతను సాగించిన అక్రమాలు మరుగున పడిపోతాయి.

ఇప్పటికైనా కలెక్టర్, టౌన్ ప్లానింగ్ ఆర్డీ, డైరెక్టర్‌లు ఈ అవినీతి అనకొండపై విచారణకు ఆదేశించి చర్యలు తీసుకునేలా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి యత్నించాలని ప్రజలు కోరుతున్నారు.



చైర్‌పర్సన్ వార్డులో నిర్మించిన అక్రమ కట్టడం

అల్పపీడనం ఆదుకునేనా..?

● వర్షాల కోసం ఎదురుచూపులు ● జిల్లా వ్యాప్తంగా 95.6 మిల్లీమీటర్ల వర్షపాతం
● వర్షాభావంతో దెబ్బతింటున్న ఖరీఫ్ పంటలు ● ఆందోళనలో అన్నదాతలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో తేలికపాటి నుంచి చెదురుమదురు వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురిసింది. శనివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని 26 మండలాల్లో 95.6 మి.మీ వర్షం కురిసింది. జిల్లా సగటు కేవలం 2.7 మి.మీ.



శుక్రవారం కురిసిన వర్షాలకు జమ్మలమడుగులోని పొలాల్లో చేరిన వర్షపునీరు


కడప (రూరల్), ఆగస్టు 31: అల్పపీడన ప్రభావం వాయుగుండంగా మారే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు జిల్లా వాసులలో ఆశలను రెకెత్తిస్తున్నాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలను వెంటబెట్టుకుని విశాఖపట్నం వైపు దూసుకొస్తున్న ఈ తుఫాను తమను కూడా ఆదుకోకపోతుందా అని జిల్లా రైతులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. తుఫాను ప్రభావంతో జిల్లాలో ఊరట కలిగించే వర్షాలు పడి పంటలకు ప్రాణం పోస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్‌లో వర్షాభావంతో రైతులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 75వేల హెక్టార్లకుపైగా వివిధ రకాల పంటలను సాగుచేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 35 శాతం మేరకే పంటలను సాగుచేశారు. ఇవి కూడా చాలా వరకు వర్షాభావం కారణంగా ఎండిపోతున్నాయి. మరో పక్క భూగర్భజలాలు అడుగంటిపోతుండడం ఖరీఫ్ రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఖరీఫ్ కాలం సగం పూర్తవుతున్నా వంకలు, వాగులు, నదులు పొంగిపొర్లే వాన లేకపోవడం రైతులను నిరాశకు గురిచేస్తోంది. ఇలాంటి తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి బలపడుతుండడంతో శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో అక్కడక్కడా వాన కురుస్తోంది.

శనివారం ఉదయం 8.30 నుంచిసాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని 26 మండలాల్లో 95.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇందులో కలసపాడు మండలంలో అత్యధికంగా 12.6 మి.మీ, పోరుమామిళ్లలో 6.4, బి.మఠంలో 6.2, సిద్దవటంలో 5.6 మి.మీ వర్షం కురిసింది. బి.కోడూరు, పెద్దముడియం, రాజుపాళెం, సింహాద్రిపురం, యర్రగుంట్ల, కొండాపురం, కాశినాయన, చాపాడు, జమ్మలమడుగు, బద్వేల్, కమలాపురం, కాజీపేట, వీఎన్ పల్లె, మైలవరం, కడప, పులివెందుల, తొండూరు, అట్లూరు, ప్రొద్దుటూరు, ముద్దనూరులలో 5 మి.మీకన్నా తక్కువ వర్షం కురిసింది. మిగిలిన 10 మండలాల్లో మబ్బులు సన్న చినుకులు తప్ప నేల తడిచే వాన కురవలేదు.

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 31: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నదులు, వంకలు పరివాహక ప్రాంతాలతో పాటు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉండొచ్చని ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పూరిగుడిసెలు, పాత మిద్దెలు, మట్టితో కట్టిన ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్షాల కారణంగా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన 08562-246344 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదని, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు తాకవద్దని తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడే సమయంలో డిస్ కనెక్షన్ తీసివేయాలని, టీవీ, కంప్యూటర్, ఫ్రిడ్జిల స్విచ్‌లు ఆఫ్ చేయాలని తెలిపారు.



కన్నులపండువగా అంజన్న గ్రామోత్సవం

చక్రాయపేట, ఆగస్టు 31: గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాసోత్సవాల సందర్భంగా చివరి శనివారం అంజన్న గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కేరళ, పత్తిపాడు వాయిద్యకారులు దాదాపు 80 మంది మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. వర్షం కారణంగా పాపాఘ్ని నదిలో కాకుండా టీటీడీ ఏర్పాటుచేసిన కళాక్షేత్రంలో ఆస్థానం నిర్వహించారు. ఈ మెరవణికి ఎన్నడూలేని విధంగా భక్తులు పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు కేసరి, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రస్తుత చైర్మన్ కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఊరేగింపు ఘనంగా ముగిసింది.

కిటకిటలాడిన గండి క్షేత్రం

చివరి శ్రావణ శనివారం కావడంతో గండిక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తుఫాన్ కారణంగా వర్షం కురుస్తున్నప్పటికి భక్తులు గండికి భారీగావచ్చారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. పాపాఘ్నిలో భక్తులు కోలాహలంగా కనిపించారు. దాదాపు 25వేల లడ్లు, 10వేల పులిహోర ప్యాకెట్లు భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, రంగారావులు జాగ్రత్తలు తీసుకున్నారు.

అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో 3వేల మందికి అన్నదానం చేశారు. వీరితో పాటు ఇందుకూరు నాగార్జున రెడ్డి, బిస్మల్లాబాద్ రామాంజులరెడ్డి, గోవిందమాల ఆధ్వర్యంలో దాదాపు 20వేల మందికి అన్నదానం చేశారు. చివరి శనివారం దాదాపు 70వేల మంది భక్తులు వచ్చి ఉంటారని అంచనా.

గండి క్షేత్రంలో అంజన్న గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయ కల్యాణమండపంలో మందేసిన ఈవో



మిట్టమల్లేశ్వరస్వామి కల్యాణమండపంలో మద్యం సేవిస్తున్న సింహాద్రిపురం ఈవో విశ్వనాథరెడ్డి

పులివెందుల టౌన్, ఆగస్టు 31: పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి కల్యాణమండపంలో శుక్రవారం సాయంత్రం సింహాద్రిపురం ఈవో విశ్వనాథరెడ్డి మరొకవ్యక్తితో కలిసి మద్యం సేవించారు. ఈ వీడియో శనివారం వైరల్ అయింది. ఆలయం పక్కన ఉన్న కల్యాణమండపంలోని ఉద్యోగులు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత.. విశ్వనాథ రెడ్డి కల్యాణమండపం ఆవరణలో అందరూ చూస్తుండగా మరో వ్యక్తితో కలిసి మద్యం తాగాడు. ఈ వీడియో శనివారం వెలుగులోకి వచ్చింది. ఆలయానికి చెందిన కల్యాణమండపంలో ఈవో మద్యం సేవించడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై శనివారం దేవదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకరబాలాజీ మాట్లాడుతూ.. కల్యాణమండపం వద్ద ఈవో విశ్వనాథరెడ్డి మద్యం సేవిస్తున్నట్టుగా సోషల్ మీడియాలో వచ్చిన వీడియో వాస్తవమే అన్నారు. దీనిపై విచారణకు ఆదేశాలు జారీచేశామని, నివేదిక వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎట్టకేలకు.. లైసెన్స్ ఫీజు చెల్లించారు

● కొన్ని బార్లకు ఫుల్‌పేమెంటు.. ● మరికొన్నింటికి సగం డబ్బులు చెల్లింపు
● రెన్యువల్ చేసుకోని రెండు బార్లు

జిల్లాలో ఎట్టకేలకు బార్ల యజమానులు లైసెన్సు ఫీజు చెల్లించి తమ బార్లను రెన్యువల్ చేసుకున్నారు. కూటమి నేతల మాటలు విని కొందరు బార్లను రెన్యువల్ చేసుకోలేదు. చివరికి 18 శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 29 బార్లు ఉన్నాయి. బార్ల లైసెన్సు గడువు ఆగస్టు 31తో పూర్తయింది. రెన్యువల్‌కు ఆగస్టు 20 లోపు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. లేదంటే 18శాతం వడ్డీతో 31లోపు చెల్లించాలి. రెండేళ్లక్రితం నిర్వహించిన వేలంలో బార్లకు పోటీ పడి లైసెన్సు దక్కించుకున్నారు. స్టేట్‌లోనే కడప ఫస్ట్. ఇక్కడ దాదాపు చాలా బార్ల లైసెన్సు ఫీజు రూ.1.60 కోట్లకు పైగానే ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఇది దాదాపు ఐదురెట్లు ఎక్కువ. కొత్త ప్రభుత్వం రావడం, కొత్త మద్యం పాలసీ అనడంతో లైసెన్సు ఫీజులు తగ్గిస్తామని కూటమి నేతలు హామీ ఇవ్వడంతో కొందరు లైసెన్సు ఫీజు చెల్లించలేదు. చివరి నిముషంలో వారు చేతులెత్తేశారు. దీంతో 18 శాతం వడ్డీతో కొంతమంది బార్ల యజమానులు మొత్తం ఫీజు చెల్లించారు. మరికొంత మంది సగం మేర అమౌంటు చెల్లించారు. కడపలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న వెన్నెల బార్, ఎర్రగుంట్లలోని ఓ బార్ లైసెన్సు రెన్యువల్ చేసుకోలేదని చెబుతున్నారు. ఫుల్ అమౌంటు కట్టిన బార్లకు నేటి నుంచే మద్యం స్టాకు ఇస్తారు. సగం పేమెంటు కట్టిన బార్లకు స్టాకు ఇవ్వరు. మూడురోజుల్లోపు డబ్బు చెల్లిస్తేనే మద్యం సరుకు ఇస్తారని అధికారులు వెల్లడించారు.

ముురుగు తొలిగేనా..!

- నిధులు ఉన్నా.. ముందుకు సాగని పనులు
- కాలువల్లో పూడికతీత పనులకు టెండర్లు పూర్తి
- వర్క్ ఆర్డర్లు జారీ చేసిన అధికారులు
- పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- అధిక లెస్‌లకు టెండర్లు వేయడమే కారణమా!

ప్రొద్దుటూరు, ఆగస్టు 31: అసలే వర్షాకాలం.. మురుగు కాలువల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండి.. మురుగునీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి.. ఈ దుస్థితిని ముందే పసిగట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. మురుగు కాలువల్లో పూడికతీత పనులకు నిధులు మంజూరు చేసి.. ఏకంగా బ్యాంకు ఖాతాలో జమ చేసి.. తక్షణం పనులు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచి.. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు వర్క్‌ఆర్డర్లు జారీ చేశారు. అయితే దాదాపు 20 రోజులు గడుస్తున్నా కాంట్రాక్టర్లు మాత్రం పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీనికి కారణం కాంట్రాక్టర్లు అధికశాతం లెస్‌కు టెండర్లు వేయడమే అని తెలుస్తోంది. దీంతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పూడికతీత పనులకు ఆటంకం కలుగుతోంది. దీనిపై మున్సిపల్ పాలకమండలి, ఎమ్మెల్యే, అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే పనులు ముందుకు సాగుతాయి. లేదంటే టెండర్లు జరిగినా.. పనులు జరగక నిధులు మురుగుతుంటాయి.


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మున్సిపాలిటీల్లో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల నిధులు జూలై 24న విడుదల చేశారు. ఏకంగా బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేశారు. యుద్ధప్రాతిపదికన రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రొద్దుటూరు మున్సి పాలిటీకి సంబంధించి కాలువల్లో పూడికతీత పనులకు రూ.1.21 కోట్లు నిధులు విడుదల చేసి.. బ్యాంకు ఖాతాలో జమ చేశారు. జూలై 31న ఐదు ప్రధాన మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్ట డానికి అంచనాలు రూపొందించి కౌన్సిల్‌లో టెండర్లకు ముందస్తు ఆమోదం తీసుకున్నారు. ఆగస్టు 1న టెండర్లు పిలిచి.. 6న ఖరారు చేశారు. పట్టణంలోని ప్రధాన కాలువ మడూరు స్ట్రామ్ వాటర్‌డ్రైన్ దొరసానిపల్లె జంబులమ్మ గుడి వద్ద నుంచి వాజ్‌పేయినగర్ వరకు పూడికతీత చేపట్టడానికి రూ.30.47లక్షలతో టెండర్ పిలువగా 15.99 శాతం లెస్‌తో ఎద్దుల కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. ప్రొద్దుటూరు చానల్-1 విజయనగరం వీధి జీవన జ్యోతి స్కూలు నుంచి శ్రీనివాసనగర్‌లోని బాలాజీ గ్యాస్ దగ్గర వరకు రూ.8.73లక్షలతో టెండరు పిలువగా 10.99 శాతం లెస్‌తో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరు దక్కించుకుంది. ప్రొద్దుటూరు ఛానల్-2 దొరసానిపల్లె స్టార్టింగ్ పాయింట్ దగ్గర నుంచి శ్రీనివాసనగర్ డిస్పోజల్ పాయింట్ వరకు రూ.17.80 లక్షలతో టెండరు పిలువగా 15 శాతం లెస్‌తో ఎద్దుల కన్‌స్ట్రక్షన్ వారు టెండరు దక్కించుకున్నారు. కొత్తపల్లె ఛానల్ రామేశ్వరం నుంచి సినీహబ్ వరకు రూ.14.32 లక్షలతో టెండరు పిలువగా.. 11.99 శాతం లెస్‌తో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ టెంటరు దక్కించు కుంది. దొరసానిపల్లె ఛానల్ ఆర్ట్స్ కాలేజీ రిజర్వాయర్ వద్ద నుంచి గాంధీరోడ్డువరకు రూ.14.39 లక్షలతో టెంటర్ పిలువగా 11.99 లెస్‌తో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ పని దక్కించుకుంది. దీనికితోడు మిషన్ ద్వారా కాలువల్లో పూడిక తీయలేని చోట మ్యానువల్‌గా పనులు చేసేందుకు మరో రూ.20 లక్షల అంచనాతో పనులు ఆమోదం తీసుకు న్నారు. ఈపూడికతీత పనులు చేపట్టాలని ఆగస్టు 6న మున్సిపల్ అధికారులు వర్కుఆర్డర్ జారీ చేశారు. కానీ ఆగస్టు 25 తేదీ వచ్చినప్పటికీ కాంట్రా క్టర్లు పని చేయడానికి అగ్రిమెంటు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. అగ్రిమెంటు చేసుకుని పని మొదలు పెట్టాలని మున్సిపల్ కమి షనర్ నోటీసులు సైతం జారీ చేసినా కాంట్రాక్టర్లు స్పందించలేదు.



కోనేటి కాల్వ వీధిలో పూడిక తీయక పేరుకుపోయిన చెత్తాచెదారం

లెస్‌కు టెండర్లు వేయడమే కారణమా..

కాలువల్లో పూడికతీత పనులు రిస్క్‌తీసుకుని చేసే పనులు కావడం తో టెండర్లు తగిన రేట్లకు వేసుకుంటే గిట్టుబాటు అవుతుంది. కానీ కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు లెస్‌కు వేసి.. పనులు చేయకుండా కాలం వృథా చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు, పాలక మండలి, ఎమ్మెల్యే సమన్వయంతో టెండర్ ప్రక్రియపై దృష్టి పెట్టి వుంటే.. ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని పలువురు విమర్శిస్తున్నారు.



మడూరు కాలువలో నిండుకున్న వ్యర్థాలు

పూడికతీత పనులు చేపడతాం

కాంట్రాక్టర్లకు అగ్రిమెంటు చేసుకుని పూడికతీత పనులు మొదలు పెట్టాలని నోటీసులు సైతం జారీ చేశాం. నోటీసులకు ఇంకా స్పందించలేదు. ఎస్ఆర్ కాంట్రాక్టర్ మాత్రం అగ్రిమెంటుకు డబ్బులు కట్టాడు. ఎద్దుల కన్‌స్ట్రక్షన్ మాత్రం ఇంకా రాలేదు. కాంట్రాక్టర్ ముందుకు రాకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

-జి.రఘునాథరెడ్డి. మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూర్లు.

ఆరోగ్యమే మహాభాగ్యం : జిల్లా ప్రధాన జడ్జి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, ఆగస్టు 31: ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఈ నానుడిని గుర్తించుకుని ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రధా న జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఆయుష్ శాఖ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈమేరకు జిల్లా కోర్టులో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు, కక్షిదారులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం సంతోషకరమన్నారు. అనంతరం జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవితో పాటు పలువురు జడ్జిలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమ్మద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యుషకుమారి పాల్గొన్నారు.

రూ.1.7 కోట్ల వార్షిక వేతనంతో అమేజాన్‌లో కొలువు... అమృతవల్లి ప్రతిభ



కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31: కడప నగరానికి చెందిన ఎర్రనాగుల అమృతవల్లి అమెరికాలో ఏడాదికి రూ.కోటి 70లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి శభాష్ అనిపించుకున్నారు. అమృతవల్లి ఫ్యాన్సీ స్టోరు అధినేత ఎర్రనాగుల ప్రకాశ్‌బాబు-సరస్వతీ దంపతుల కుమార్తె అమృతవల్లి విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తరువాత జేఈఈ పరీక్షలో ప్రతిభ చూపి దుర్గాపూర్ ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆప్ టించర్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికై 14 నెలల పాటు పనిచేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలో కంప్యూటరు సైన్స్ బ్రాంచ్‌లో ఎంఎస్ పూర్తి చేశారు. ఎంఎస్ డిగ్రీ తీసుకున్న నెల రోజులలోపే వాషింగ్టన్‌లోని కియాటెల్‌లో గల అమేజాన్ కేంద్ర కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంటు ఇంజనీరు-1గా 2,02,200 యూఎస్ డాలర్ల వార్షిక వేతనం (మన కరెన్సీలో ఏడాదికి 1.70 కోట్లు)తో నియమితులయ్యారు. అమృతవల్లికి అమెరికాలో ఉన్నత ఉద్యోగం లభించడం పట్ల చిన్నతనంలో విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

మహిళలకు ఆర్థిక సాయం



అర్థిక సాయం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్) ఆగస్టు 31: రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురు మహిళలకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం సాయంత్రం ఆర్థిక సాయం చేశారు. ఈ నెల 23న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రైల్వేకోడూరు వచ్చిన ప్పుడు ఆ ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు తమ ఆరోగ్య సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. రైల్వేకో డూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాయచో టికి వచ్చి కలెక్టర్‌కు వారి వినతిపత్రాలను అందజేయడంతో కోడూరు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి మనుమరాలికి రూ.50వేలు, ఓబులవారిపల్లికి చెందిన కల్పనకు రూ.20వేలు, చిట్వేలికి చెందిన బొంతల కుమారికి రూ.20 వేల చెక్కులు అందజేశారు.

ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



చెన్నూరు, ఆగస్టు 31: ఇంట్లో వారు ఆదరించలేదని.. అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకోబోయిన పశువైద్యశాఖకు చెందిన రిటైర్డ్ ఉద్యోగిని కాపాడి బంధువులకు అప్పగించిన సంఘటన శనివారం చెన్నూరులో జరిగింది. కడప ప్రకాశ్‌నగర్‌కు చెందిన మండ్ల సంటెన్న (72) పశువైద్య శాఖ లో ఏవీవోగా పని చేస్తూ 12 ఏళ్ల క్రితం రిటైర్ అయ్యారు. ఈయన గత కొంతకాలంగా కీళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పట్టించుకోలేదని.. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని ఓ ఆటోలో చెన్నూరు సమీపంలోని కొండపేట వంతెనపైకి శనివారం మధ్యాహ్నం చేరుకున్నాడు. అతని ప్రవర్తన గమనించిన ఆటో డ్రైవరు దారిలో చెన్నూరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఏఎస్ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు శ్రీనివాసరాజు, శివారెడ్డిలు అక్కడకు చేరుకుని.. వంతెన పైనుంచి దూకేందుకు యత్నించిన సంటెన్నను కాపాడి.. అక్కడే కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 31: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు వద్ద ఈ నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బింగి నరసింహులు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు. ఏటూరు గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్రవాహనంలో వెలుతుండగా తాళ్లప్రొద్దుటూరు వద్ద వెనుక నుంచి బైక్ వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

యూసీఐఎల్ మైన్‌లో ప్రమాదం.. ఒకరికి గాయాలు



పులివెందుల, ఆగస్టు 31: యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మైనింగ్‌లో ప్రమా దం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన వెంకటమురళికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... శనివారం ఉదయం యూసీఐఎల్‌లోని మైనింగ్‌లో ఓ బండరాయి ఊడిపడి వెంకటమురళి అనే కార్మికుడిపై పడింది. దీంతో అతని కాలికి తీవ్ర గాయమైంది. తోటి కార్మికులు వెంటనే అంబులెన్స్ ద్వారా పులివెందుల ఆసుపత్రికి తరలించి.. వైద్యం అందించారు. యూసీఐఎల్ మైనింగ్‌లో ఇటీవల ఇలాంటి ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని కార్మికులు గగ్గోలుపెడుతున్నారు. ముున్ముందు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

4న టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

వేంపల్లె, ఆగస్టు 31: రాష్ట్ర స్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే కడప జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు ఈనెల 4వ తేదీన వేంపల్లె జడ్పీ హైస్కూల్ ఆటస్థలంలో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. సెప్టెంబరు 14 నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని, ఆ పోటీల్లో పాల్గొనే జిల్లాజట్టును ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలోని సబ్‌జూనియర్ బాల బాలికలు ఈ ఎంపిక పోటీలకు హాజరుకావాలని ఆయన కోరారు.

హోరాహోరీగా టార్గెట్ బాల్ సౌత్‌జోన్ సీనియర్ పోటీలు



కేరళ, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 31: రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సౌత్‌జోన్ టార్గెట్ బాల్ సీనియర్ పోటీలు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలు శనివారం టోర్నమెంట్ ఆర్గనైజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. లీగ్, నాకౌట్‌లలో జరగనున్న ఈ పోటీల్లో శనివారం మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్- తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు గెలుపొందింది. అలాగే పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్-తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు విజయం సాధించింది. అలాగే పురుషుల విభాగంలో తమిళనాడు-పాండిచ్చేరి మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కూడా తమిళనాడు జట్టు విజయం సాధించినట్టు టోర్నమెట్ ఆర్గనైజర్ తెలియజేశా రు. అలాగే కేరళ- కర్ణాటక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ జట్టు గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ అరుణమ్మ, కడప జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సభ్యులు ప్రవీణ్‌కిరణ్, నిత్యప్రభాకర్, సుబ్బయ్య, బాలయ్య, అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సభ్యులు వీరాంజనేయులు, రెడ్డెయ్య, నరసరాజు, ఆంజనేయులు, గోపాల్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నిష్కళంక మాత మరియతల్లి

కడప (కల్చరల్) ఆగస్టు 31: లోక రక్షకుడు ఉదయించుటకు వీలుగా ఆ భగవంతుడు నిష్కళంక మాత అయిన మరియ తల్లిని ఎంచుకుని అభయమిచ్చారని, అందుకే ఆ తల్లి ఆరోగ్యమాత అని అన్నమయ్య జిల్లా రామాపురం విచారణ గురువు ఫాదర్ చిన్నప్ప పేర్కొన్నారు. కడప నగర రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఉత్సవాలలో భాగంగా మూడవరోజైన శనివారం స్థానిక పుణ్యక్షేత్రంలో విచారణ గురువు ఫాదర్ బాల సుందరం దివ్య బలిపూజను సమర్పించగా.. చిన్నప్ప మరియతల్లి సందేశాన్ని అందించారు. కాగా ప్రత్యేకంగా అలంకరించిన మరియతల్లి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ప్రదర్శించారు. పుణ్యక్షేత్రం ఫాదర్లు, పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న ఫాదర్ చిన్నప్ప



ప్రత్యేక అలంకారంలో మరియ తల్లి

గండికోట నుంచి మైలవరానికి 20వేల క్యూసెక్కులు విడుదల



కొండాపురం, ఆగస్టు 31: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శనివారం 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గురువారం మైలవరానికి 7,500 క్యూసెక్కులు విడుదల చేయగా.. దాన్ని 20వేల క్యూసెక్కులకు పెంచారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 880 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 9500 క్యూసెక్కులు, వర్షపు నీటి ద్వారా 1265 క్యూసెక్కలు ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 18.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

బతుకు బండలు

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు బండలపాలయ్యాయి. చదువుల కోసమని రేకుల షెడ్డులో తలదాచుకున్న విద్యార్థులు ఇద్దరైతే, అద్దెలు తక్కువని కొండ పక్కనే ఇంటిలో దిగినవారు కొందరు. సున్నపుబట్టీల సెంటర్‌లో శనివారం కొండరాళ్లు పడి మృతిచెందిన వారి కథలు చివరికి విషాదాంతమయ్యాయి.

- సున్నపుబట్టీల సెంటర్‌లో పడిన కొండరాళ్లు
- ఐదుగురు మృతి.. దొరకని మరో విద్యార్థి ఆచూకీ
- రెండు భవనాలు, రెండు షెడ్లు నేలమట్టం
- శిథిలాల కింద ఇరుక్కుపోయిన నివాసితులు
- భయం గుప్పెట్లో కొండప్రాంత వాసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): కొండరాళ్లు ఐదుగురి జీవితాలను చిదిమేశాయి. మరో నలుగురిని క్షతగాత్రులను చేశాయి. క్రీస్తురాజపురంలోని సున్నపుబట్టీల సెంటర్‌కు సమీపాన, 18వ నెంబరు సచివాలయం ఎదురుగా ఇళ్ల పక్కనే ఉన్న కొండరాళ్లు శనివారం ఉదయం ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఈ ఘటనలో రెండు భవనాలు, రెండు షెడ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. బ్యాంక్ ఉద్యోగి నవుదు మేఘన (25), సున్నపుబట్టీల సెంటర్‌కు చెందిన బోలెం లక్ష్మి (49), పశ్చిమ బెంగాల్‌లోని మగ్రాత్ ప్రాంతానికి చెందిన పి.లాల్ (38), జంపన అన్నపూర్ణ (55), కడప జిల్లాకు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి సంతోష్ (18) మృతిచెందగా, మరో విద్యార్థి యశ్వంత్ (18) ఆచూకీ ఇంకా తెలియలేదు. ఈ ఘటనలో మేఘన తండ్రి సత్యనారాయణ, తల్లి నాగమణి గాయాలతో బయటపడ్డారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మేఘనను బయటకుతీసి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. అలాగే, అమ్మ కల్యాణ మండపం ప్రాంతానికి చెందిన అలజంగి శాంతి, మొగల్రాజపురం నవోదయ రోడ్డుకు చెందిన కొప్పరవాలి స్వామి కూడా గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



కడప జిల్లాకు చెందిన విద్యార్థి సంతోష్ (18)

సహాయక చర్యలకు బ్రేక్

శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు కొనసాగాయి. కొండరాళ్లను పక్కకు తప్పించి శిథిలాలను తొలగిస్తున్నప్పుడు ఒక్కొక్కటిగా మృతదేహాలు బయటపడ్డాయి. వర్షం నిరంతరాయంగా కురవడంతో కొండను ఆనుకుని ఉన్న ప్రాంతంలో కదలికలు కనిపించాయి. దీంతో సహాయక చర్యలు ఆగాయి. మళ్లీ రాళ్లు జారిపడే సూచనలు కనిపించడంతో చుట్టుపక్కల భవనాల్లో ఉన్నవారిని బయటకు రప్పించారు. వర్షం తగ్గాక మళ్లీ సహాయక చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో ఫ్లడ్‌లైట్ల వెలుతులో ఎక్స్‌కవేటర్‌తో శిథిలాలను తొలగించారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు పరిశీలించారు.

అద్దెకు దిగిన మర్నాడే మృత్యువాత

కడప జిల్లా మైదుకూరుకు చెందిన కమ్మరి సంతోష్ ఆచారి (18), కృష్ణాజిల్లా కౌతవరం గ్రామానికి చెందిన యశ్వంత్ (18) నగరంలోని ప్రైవేట్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో చేరారు. ఇద్దరూ కలిసి ఒకే గదిలో ఉండాలని నిర్ణయించుకున్నారు. సున్నపుబట్టీల ప్రాంతంలో 18వ నెంబరు సచివాలయం ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో అద్దెకు దిగారు. కొద్దిరోజుల క్రితం వరకు హాస్టల్‌లో ఉన్నవారు శుక్రవారమే ఈ షెడ్డులోకి వచ్చారు. కొండరాళ్లు జారిపడటంతో యశ్వంత్, సంతోష్ శిథిలాల కింద ఇరుక్కుపోయారు. సంతోష్ మృతదేహాన్ని ఎస్డీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీయగా, యశ్వంత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

ఆ కుటుంబం సురక్షితం

క్రీస్తురాజపురానికి చెందిన కాకుమాని పెద వెంకటేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండకు చెంతనే ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి రెండు పోర్షన్ల భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చాడు. ఒక పోర్షన్‌లో ఉన్న కుటుంబం నెలక్రితం గుంటూరుకు వెళ్లింది. దీంతో ఈ కుటుంబం సజీవంగా మిగిలింది. భవనం మొత్తం నేలమట్టం కావడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి ధ్వంసమైంది. కుటుంబం మాత్రం ఇంట్లో లేకపోవడంతో మృత్యువు నుంచి బయటపడింది. పెద వెంకటేశ్వరావు ఏడాది క్రితమే ఈ ఇంటిని ఆధునికీకరించారు.



ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని మున్సిపల్ కమిషనరు వైవో నందన్ అన్నారు. శనివారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్ ఇంజనీరు కె.రత్నాలరాజు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రత్నాలరాజును మున్సిపల్ అధికారులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా శనీశ్వరునికి తైలాభిషేకం

కడప (కల్చరల్), ఆగస్టు 31: శని త్రయోదశి సందర్భంగా శనివారం రామకృష్ణనగర్‌లో వెలసిన సాయి శనీశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి శ్రీధర్‌శర్మ సారథ్యంలో శనీశ్వరుడికి ఘనంగా తైలాభిషేకం చేశారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం 8 వరకు స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. గడ్డిబజార్‌లో కామకోటి కళాంబా సమేత సోమసుందరేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ సారథ్యంలో శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పేదలకు ఆసరా ఎన్టీఆర్ భరోసా


పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత గోవర్ధనరెడ్డి


పింఛన్లు అందిస్తున్న టీడీపీ నాయకుడు అమీర్‌బాబు


పింఛన్లు అందిస్తున్న శివకొండారెడ్డి


పింఛన్లు అందిస్తున్న వికాస్ హరిక్రిష్ణ

- ఘనంగా పింఛన్ల పండుగ
- ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : పేదలకు ఎన్టీఆర్ భరోసా ఆసరాని స్తోందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కడప నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం నుంచే ప్రారంభమైంది. ఒక రోజు ముందుగానే పింఛన్లు అందడంతో అవ్వ తాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కడప నగరంలో పింఛన్ల పంపిణీ జరిగింది. టీటీపీ నేతలు సచివాలయ సిబ్బంది కలిసి అవ్వతాతలకు పింఛన్లను అందించారు.

38వ డివిజన్‌లో... కడప నగరం 38వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అవ్వాతాతలకు పింఛన్లు అందించారు. టీడీపీ మైనార్టీ నాయకులు నాసర్ అలీ, ఆదిల్, డాక్టర్ వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5వ డివిజన్‌లో... కడప నగరం 5వ డివిజనులో టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి బూత్ కన్వీనరు ఎస్.బాలకృష్ణ ఆధ్వర్యంలో పింఛన్లను అవ్వతాతలకు అందించారు.

45వ డివిజన్‌లో... 45వ డివిజనులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పింఛన్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా అవ్వతాతలకు పింఛన్లు ఇస్తున్నప్పుడు వారి ముఖాల్లో ఆనందం కనబడిందన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ అనిల్, ఉదయ్, శ్రీను పాల్గొన్నారు.

19వ డివిజనులో... కడప నగరం 19వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి పింఛన్లను అవ్వతాతలకు అందించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసు అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, 21వ డివిజను మాజీ కార్పొరేటరు ఫక్ృద్దీన్ పాల్గొన్నారు.

49వ డివిజన్‌లో...
కడప (మారుతీనగర్), ఆగస్టు 31: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీని వానలో కూడా పంపిణీ చేశారు. కడప నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె కాలనీలో శనివారం ఉదయం 6 గంటలకు సంబంధిత సచివాలయ వీఆర్‌ఓ సుబ్బరాయుడు పింఛన్‌లను అందజేశారు. ఆ డివిజన్ టీడీపీ యువనాయకులు నిత్యపూజయ్య, కిరణ్‌కుమార్, సుబ్బారెడ్డి, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో... కడప నగరం 5వ డివిజను అశోక్‌నగర్‌లో జనసేన నాయకుడు తుంగా రమణయ్య, టీడీపీ నాయకులు చినబాబు ఆధ్వర్యంలో పింఛన్లను అవ్వతాతలకు అందించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వారి వారి పరిధిలో ఉంటున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తెల్లవారుజామునే పింఛన్లు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూరులో... పేదలకు ఎన్టీఆర్ భరోసా ఆసరాని స్తోందని మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా ఒక రోజు ముందుగానే శనివారం పింఛన్లను అటు టీడీపీ నేతలు, ఇటు అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామనపల్లెలో టీడీపీ సీనియర్ నేత ఎల్వీ రమణారెడ్డి, తాడిగొట్ల బుజ్జన్న, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ పుత్తా వేణుగోపాలరెడ్డి చెన్నూరులో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, మైనార్టీ జిల్లా నాయకులు షబ్బీర్‌హుసేన్, బెస్తకాలనీలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, బెస్త సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మల్లెసుబ్బయ్య, బుడ్డాయపల్లెలో టీడీపీ జిల్లా నేత పాలగిరి పెద్దసుబ్బారెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు పాలగిరి సుదర్శన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుదర్శన శర్మ మాట్లాడుతూ ఇప్పటికే 96 శాతం పంపిణీ చేశామని, మిగతా వారు లేనందున వారికి సోమవారం పంపిణీ చేస్తామన్నారు.

సింహాద్రిపురంలో...
సింహాద్రిపురం ఎస్సీ కాలనీలో టీడీపీ నేతలు పుప్పాల శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా సమారు 96 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. అందుబాటులో లేని వారికి 2వ తేదీ అంజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

పులివెందులలో...పట్టణంలో టీడీపీ నేతలు పింఛన్ల పంపిణీ చేపట్టారు. పెద్దకొండప్ప కాలనీలో వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహబూబ్ బాష, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఖాసీంవల్లి, గంగాధర్‌రెడ్డి, క్రిస్టియన్ లైన్‌లో తూగుట్ల ప్రేమ్‌సాగర్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లను చేశారు.

వేంపల్లెలో... మండలంలో శనివారం ఉదయం నుంచే సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు పింఛన్లు పంపిణీ చేశారు.


పింఛన్లు అందిస్తున్న తుంగా రమణయ్య


పులివెందుల:పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రాష్ట్రంలో ఒక రోజు ముందే పెన్షన్ల పండుగ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31: రాష్ట్రంలో ఒక రోజు ముందే పెన్షన్ల పండుగ జరిగిందని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరి లోకేశ్ తెలిపారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ప్రజల అవసరాల దృష్ట్యా ముందే పింఛన్లు అందించారన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తామన్నారు. శనివారం ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను సెప్టెంబరు 2004 నుంచి అమలు పరిచారని ఇది ఉద్యోగ ఉపాధ్యాయుల జీవితాలకు వ్యతిరేకదినమన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లాకార్యదర్శులు చంద్రశేఖర్, ఆర్.శ్రీరాములు పాల్గొన్నారు.


పాత పెన్షన్ అమలే ఏకైక పరిష్కారం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛనువిధానానికి ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసే ఆలోచనలను విడనాడి పాత పింఛను వధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి విజయకుమార్, మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో యుటిఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరుకు వినతిపత్ర అందించారు.

పదోన్నతులు లేకుండా పని సర్దుబాటా: ఎస్టీయూ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : రాష్ట్ర ప్రభుత్వం పురపాలక ఉపాధ్యాయులకు కొన్ని సంవత్సరాలుగా పదోన్నతులు బదిలీలు చేపట్టకుండా కేవలం పనిసర్దుబాటు చేయడం పురపాలక ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని రాష్ట్ర పురపాలక కన్వీనరు రవిశంకర్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెంటనే మున్సిపల్ పాఠశాలల్లో పదోన్నతులు చేపట్టాలని, పాఠశాలలకు గుదిబండగా ప్రభుత్వం ఇచ్చిన జీఓ 84 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పులివెందులలో 30 యాక్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ మురళి

పులివెందుల టౌన్, ఆగస్టు 31: పులివెందులలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని పులివెందుల డీఎస్పీ బుక్కే మురళి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పులివెందుల నియోజకవర్గ పరిధిలో అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ఇతర అనధికార మీటింగ్‌లను నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

దత్తాత్రేయ శర్మ, విఠలాచార్యులకు జానమద్ది సాహితీ పురస్కారాలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : కర్నూలుకు చెందిన ప్రముఖ అవధాని కవి గుండ్లూరి దత్తాత్రేయ శర్మ, గ్రంథాలయ సేవలకు తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లాకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ సూరెళ్ల విఠలాచార్యకు జానమద్ది సాహితీపీఠం పురస్కారాలు అందిస్తున్నట్లు పీఠం గౌరవ సలహాదారులు డాక్టర్ రమణాచారి, మండల బుద్ధప్రసాద్, పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ జానమద్ది హనుమత్‌శాస్త్రి స్మారకంగా నెలకొల్పిన సాహితీపీఠం తరఫున ప్రతి ఏడాది పురస్కారాలు ప్రకటిస్తున్నామన్నారు.
అక్టోబరు 20న డాక్టర్ జానమద్ది జన్మదిన సందర్భంగా కడపలో జరిగే సభలో పురస్కారం జ్ఞాపికలను అందించనున్నట్లు స్పష్టం చేశారు. పురస్కారంలో 10వేలు నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించడం జరుగుతుందన్నారు. సభకు సాహితీ ప్రముఖులు, అధికారులు హాజరు కానున్నారు.

ప్రతి ఒక్కరూ తల్లి పేరు మీద మొక్క నాటండి: ఎమ్మెల్యే


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 31 : చెట్లను నాటి పర్యావరణం పరిరక్షించండి, ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద మొక్కలు నాటి పరిరక్షించాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రి నందు టీడీపీ యువ నాయకుడు పుత్తా లక్ష్మీరెడ్డితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లు నాటడం మనందరి బాధ్యత అన్నారు. చెట్లు నాటి వాటిని పెంచడంతో పర్యావరణం పరిరక్షించుకోవచ్చన్నారు. సకాలంలో వర్షాలు కురి పంటలు పండించుకుని అధిక లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి అక్కడి డ్యూటీ డాక్టర్లతో మాట్లాడి రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని సూచించారు.తహసీల్దారు కమిషనరు రాముడు, వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, రెడ్డికరీం, శివశంకర్‌రెడ్డి, గండి నారాయణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.అలాగే స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వనం-మనం కార్యక్రమానికి డీసీఓ మాధవీలత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐగా హమీద్‌ఖాన్ బాధ్యతల స్వీకరణ

కడప (క్రైం), ఆగస్టు 31 : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐగా హమీద్‌ఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో టూటౌన్ సీఐగా పనిచేశారు. అనంతపురం జిల్లాలో ఎస్‌ఐగా, సీఐగా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన కడప విజిలెన్స్ సీఐగా పనిచేస్తున్న ఈదుర్‌బాషా స్థానంలో హమిద్‌ఖాన్ బాధ్యతలను చేపట్టారు.

ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : గత రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షానికి ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలకు కూడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ అధికారులు విద్యుత్ అధికారులు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటికి రావద్దని సూచించారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో రోడ్లు రవాణా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 :గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనరు వైఓ నందన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సంబంధిత సహాయం అత్యవసర పరిస్థితుల కోసం మున్సిపల్ కార్పొరేషన్ కంట్రోల్ రూము 24 గంటలు పనిచేస్తుందని అవసరమైన వారు కంట్రోల్ రూము నెం.99490 93772 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజల భద్రత కోసం సురక్షిత నిబంధనలు పాటించాలని కోరారు.

ప్రజలు మెచ్చేలా పౌరసేవలు

- పులివెందుల కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్, ఆగస్టు 31: పురపాలక సంస్థ ఆధ్వర్యంలో అందించే అన్ని రకాల పౌరసేవలలో లోపాలు లేకుండా పారదర్శకంగా అందించి ప్రజలు మెచ్చేలా పనిచేస్తానని మున్సిపల్ నూతన కమిషనర్ రాముడు తెలిపారు. కమలాపురం మున్సిపాలిటీ నుంచి పులివెందులకు బదిలీపై వచ్చిన ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మున్సిపాలిటీ సమస్యలపై అధ్యయనం చేసి దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే సెక్షన్ల వారీగా ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు.

ధర్నాను జయప్రదం చేయండి : సీఐటీయూ

వేంపల్లె, ఆగస్టు 31: విద్యుత్ కార్మికుల సమస్యలపై సెప్టెంబరు 5వ తేదీన తిరుపతి ఎస్పీడీసీఎల్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ అనుబంధ యూఈసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 ఏళ్లుగా పనిచేస్తున్న 23500 మంది విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కొత్త ప్రభుత్వం ఆలోచన చేసి వారి కుటుంబాల్లో వెలుగులునింపాలన్నారు. కొత్త ఆపరేటర్లుగా ఉన్న వారందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి తేవాలి

- ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శిజయవర్ధన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 31 : జిల్లాలో వర్షాల కారణంగా ప్రజలు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని జిల్లా వైద్య అధికారులు గ్రామగ్రామాన తిరిగి వైద్యసేవలు అందించాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతుంటే ప్రైవేటు ఆసుపత్రులు అదను చూసుకునిపేదల నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు దీనిపై స్పందించి తక్షణం మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

యువతరంపై ఆరుద్ర ముద్ర

కడప (నాగరాజుపేట), ఆగస్టు 31 : అభ్యుదయ కవిగా శ్రీశ్రీ తరువాత యువతరంపై ఎక్కువ ముద్రపడిన కవి ఆరుద్ర అని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి అన్నారు. రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శనివారం సాయంత్రం ఆరుద్ర శత జయంతిని నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గానుగపెంట హనుమంతరావు, సభ్యులు పొదిలి నాగరాజు, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి మాట్లాడారు.



వర్షం రాకతో రైతుల్లో ఆనందం

జమ్మలమడుగు, ఆగస్టు 31: జమ్మలమడుగులో శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన భారీవర్షానికి పొలాల్లో వర్షపునీరు నిలిచింది. రెండు నెలల నుంచి రైతులు పంటలు సాగు చేసుకోవడానికి సేద్యాలు చేసి వర్షంకోసం ఎదురుచూశారు. కొన్ని గ్రామాల్లో వర్షం కోసం వానదేవుడు కరుణించాలని పూజలు సైతం చేశారు. గత వారంలో కొంత వర్షం కురవడం, ఏకంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మండలంలోని బోర్లు లేని రైతులు శేషారెడ్డిపల్లె, గొరిగెనూరు, మోరగుడి, తదితర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని దేవగుడి, చలివెందుల, ధర్మాపురం, పి.సుగుమంచిపల్లె, పెద్దదండ్లూరు, తదితర గ్రామాల పొలాల్లో నీరు నిలిచింది. వర్షం పదును అయిందని, ఇక ఇబ్బందే లేదని పలువురు రైతులు తెలిపారు. కాగా జమ్మలమడుగులో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురిసింది. రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. తెల్లవారుజాము వరకు ఎడతెరపి లేకుండా జల్లులు కురిశాయి. భారీ వర్షంతో ప్రధాన రోడ్లు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో వర్షపునీరు నిలిచింది. మోరగుడిలోని బిండెల వీధిలో అంగన్వాడీ పాఠశాల వరకు మోకాళ్లలోతు నీరు నిలబడ్డాయి. ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రధాన రోడ్డుపై రాత్రి వర్షపు నీరు నిలిచాయి. అలాగే జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని సైలాస్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా రోడ్డు, తహసీల్దారు కార్యాలయ ఆవరణ, ఆర్టీసీ గ్యారేజీ, ఎత్తపువారి కాలనీకి వెళ్లే దారిలో ఆర్డీవో కార్యాలయ ఆవరణలో తదితర చోట్ల వర్షపునీరు నిలిచాయి. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాజుపాలెం..: పత్తి, వరి, పసుపుపంటలకు శుక్రవారం రాత్రి నుంచి పడుతున్న వర్షానికి కాస్త ఊరట లభించింది. అయితే రాజుపాలెం మండలంలో తుంపర వాన తప్ప సరైన వాన పడడంలేదు. ఎగువన కురిసిన వర్షాలకు నల్లవాగు తదితర వంకలు ప్రవహిస్తున్నాయి. ఏదిఏమైనా తుఫాను వల్ల మంచి వర్షం కురిస్తే మినుము, జొన్న పంటలు సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

మైలవరం..: ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటితో గాలేరి నగరి సుజల స్రవంతి కాలువ నిండుగా ప్రవహిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. జమ్మలమడుగు- తాడిపత్రి ప్రధాన రహదారిలోని కడప-కర్నూల్ జిల్లాల సరిహద్దు ప్రాంతం దన్నవాడ వద్ద కాలువ నిండుగా కళకళలాడుతూ ఉండటంతో సందడి నెలకొంది. వర్షాలకు తోడు శ్రీశైలం నుంచి గండికోటకు, అవుకు జలాశయం నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా నీరు ప్రవహిస్తూ పరవళ్లు తొక్కుతోంది. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 20 వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 2.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది.





మైలవరం...దన్నవాడ గ్రామ సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ, మోరగుడి ఆంజనేయస్వామి గుడి వద్ద నిలిచిన వర్షపునీరు

పోరుమామిళ్ల..: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పోరుమామిళ్లలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పెద్ద,పెద్ద గుంతలు ఉన్న చోట వర్షం నీరు ఎక్కుగా నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా అంబేడ్కర్ సర్కిల్, ఆర్టీసీబస్టాండు సమీపంలో, సాయిబాబా దేవాలయం వద్ద ఈ వర్షం నీరు ఎక్కువగా నిల్వ ఉండడంతో పట్టణవాసులు, ద్విచక్ర వాహనదారులు, చిన్న చిన్న ఆటోలు నడుపుకునేవారు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి విస్తరణ పనుల్లో నీటిగుంతలను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాజీపేట..: ఖాజీపేట మేజర్ పంచాయతీలోని బీసీ కాలనీలో చినుకు పడితే రహదారిపై అడుగుమేర నీరు నిలబడుతుంది. కొన్ని సంవత్సరాలుగా అధికారులు, నాయకులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారులు మాత్రం మాకేమన్న చందంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పిల్లలు స్కూలుకు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. అయిదు సంవత్సరాల్లో ఓట్ల కోసం మాత్రం నాయకులు వచ్చారు తప్ప తర్వాతా అటువైపు తొంగిచూసిన పాపాన పోలేదని, కనీసం కూటమి ప్రభుత్వమైనా పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. కాగా మండల పరిధిలో 81.4 మి.మీ. వర్షం నమోదు అయిందని ఏఎస్‌వో ప్రసూన తెలిపారు.



ఖాజీపేట... బీసీ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు



పోరుమామిళ్ల..ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షంనీరు

మాకు ఆ టీచరే కావాలి

దత్తాపురంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



టీచర్ పద్మావతి బదిలీ ఆపాలంటూ ఎంఈవో కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొండాపురం, ఆగస్టు 31 మండలంలోని దత్తాపురం బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తు బదిలీపై వెళుతున్న పద్మావతి అనే ఉపాధ్యాయురాలిని బదిలీ చేయొద్దంటూ శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన తెలిపారు. పద్మావతి మేడం తమ పిల్లలకు చక్కగా పాఠాలు చెబుతోందని వెంటనే ఆమె బదిలీని ఆపాలని నిరసన వ్యక్తం చేశారు. ఒకవేళ ఆమెను ఇక్కడ కొనసాగించకపోతే తమ పిల్లలకు టీసీలు ఇస్తే మరొక పాఠశాలకు వెళ్లిపోతామని కొండాపురం ఎంఈవోలు ఓబులేసు, రామయ్యకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు.వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగం పద్మావతి టీచర్ ఎర్రగుంట్లకు బదిలీ అయిందని ఎంఈవో ఓబులేసు తెలిపారు. ఈ విషయం తమ పరిధిలో లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎంఈవో చెప్పారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి : జడ్జి భార్గవి

జమ్మలమడుగు, ఆగస్టు 31: పెండింగ్ కేసులపై పోలీసు అధికారులు, న్యాయవాదులు దృష్టి సారించి పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబరు 14వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జడ్జి న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్జి మాట్లాడుతూ కేసులు పరిష్కరించుకోకుండా కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారులకు పోలీసు అధికారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ కేవీ మురళీధర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, జంబాపురం మహేశ్వరి, టి.సుబ్బారెడ్డి, జాకీర్, భూతమాపురం సుబ్బారావు, సీఐలు, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలుపుకున్న సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 31: ఎన్నికల మేనిఫెస్టోలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణ , చేతివృత్తిదారులకు, అలాగే దేవాలయ ఆలయ కమిటీలో కమిటీ సభ్యుడిగా నాయీ బ్రాహ్మణులను నియమించాలని చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. శనివారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణులు టీడీపీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ, చేతివృత్తిదారులకు కనీస వేతనం రూ.25 వేలు పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నాయీ బ్రాహ్మణ కడప పార్లమెంటు అధ్యక్షుడు గజ్జెల గోవిందు, లక్ష్మీనరసయ్య, సుబ్బరాయుడు, చక్రపాణిరెడ్డి, బీర్రు సంతోష్, భాను, సుబహాన్, ఈశ్వర్, నాయక్, పార్థసారథి, మధు, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కమనీయం... గోపాలస్వామి కల్యాణం



అట్లూరు, ఆగస్టు 31 : శ్రావణ మాసం వారోత్సవాల్లో భాగంగా ఆఖరి శనివారం కొండూరు నుంచి వేణు గోపాలస్వామి రుక్మిణీ సత్యభామ సమేత ఉత్సవ విగ్రహాలను ఆలయ ధర్మకర్త నందగోపాల్‌రెడ్డి గుంటూరు గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులు కాలినడకన తీసుకుని కొండూరు పడమటి భాగాన కొండలో వెలసిన కొండ గోపాలస్వామి ఆలయంలో కల్యాణం జరిపించడం ఆనవాయితీ. శ్రావణమాసంలో కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు, బద్వేలు మండలం గ్రామాల నుంచి భక్తులు కొండపైకి చేరుకుని గోపాలస్వామిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. కల్యాణం అనంతరం విగ్రహాలను భక్తులు కాలినడకన తీసుకుని కొండూరులో రాత్రికి గోపాలస్వామి రుక్మిణీ సత్యభామ ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై నిందితులను కఠినంగా శిక్షించాలి

బద్వేలు, ఆగస్టు 31: గుడ్లవల్లేరులోని కళాశాలలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, ఐద్వా మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ కో-కన్వీనర్ నాగలక్ష్మి, ఫాతిమా, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు అనంతమ్మ, మోక్షమ్మ మాట్లాడారు. డీవైఎఫ్ఐ నాయకురాలు నాగేశ్వరి, రాజేశ్వరి, ఐద్వా మహిళా సంఘం నాయకురాళ్లు ఖైరున్ బీ, బాలమ్మ, రామలక్షుమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ముద్దనూరు ఆగస్టు31:స్థానిక వరదాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసాల్లో భాగంగా చివరి శనివారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు ఉమ్మడి శెట్టి సురేష్, సుధాకర్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ, సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా బాలకృష్ణ సినీస్వర్ణోత్సవాలు



జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 31: సినీనటుడు నందమూరి బాలక్రిష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలను నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టిపాడు రోడ్డులోని మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 50 సంవత్సరాలు పైబడిన నందమూరి అభిమానులకు, అలాగే లెజెండ్ సినిమా 1116 రోజులు ప్రదర్శింపజేసిన కోనేటి ఓబుళరెడ్డిని ఘనంగా సత్కరించి స్వర్ణోత్సవ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు సారదినాయుడు మాట్లాడుతూ బాలక్రిష్ణ తండ్రికి తగ్గ తనయుడుగా సినిమాలతోపాటు రాజకీయాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

యాదవ సమాజ అన్నసత్రం అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యయాదవ్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 31 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని యాదవ సమాజ అన్నదాన సత్రం అభివృద్ధికి కమిటీ సభ్యులందరూ సహాయ సహకారాలు అందించాలని అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యయాదవ్ పేర్కొన్నారు. శనివారం కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు ఇటీవల కల్యాణమండపాన్ని రిపేరు చేయించామన్నారు. అలాగే వసతిగదులకు పూర్తిస్థాయిలో రంగులు, విద్యుత్ అలంకరణ, పైపులైన్లు మరమ్మతులు చేపట్టామన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భోజన సదుపాయాన్ని కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజు, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్, కమిటీ సభ్యులు కార్యనిర్వాహక మెంబర్లు పాల్గొన్నారు.

తప్పు ఉంటే నిగ్గు తేల్చాలి

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 31 : తన రాజకీయ జీవితంలో తనపై ప్రత్యర్థులు ఒక్కతప్పు వెతికినా కానరాదని వుంటే నిగ్గుతేల్చమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఛాలెంజ్ విసిరారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుందూనదిలో మట్టి తోలుతూ పట్టుబడ్డ టిప్పర్లపై ఎన్‌వీఆర్ఆర్ అని వుంటే నంద్యాల వరదరాజులరెడ్డిదే నని బంగారురెడ్డి ఆరోపించారన్నారు. నాపేరు గల వాళ్లు అనేక మంది వున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా బంగారురెడ్డి కుందూలో మట్టిదోపిడీ చేశామనడం హాస్యాస్పదం అన్నారు. ఐదేళ్ళుగా పెన్నానదిలో ఇసుక, మట్టి, గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్ జూదం నడిపింది రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది బంగారురెడ్డి అని దేశమంతా తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రొద్దుటూరులో ఎక్కడా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగరాదని పోలీసులను ఆదేశించానన్నారు. ఎవ్వరు ఇసుక, మట్టి, గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్, భూకబ్జాలకు పాల్పడినా వదలవద్దని ఎవ్వరికీ నేను మద్దతు ఇవ్వనని స్పష్టంగా చెప్పానన్నారు. అలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేయడం ప్రోత్సహించడం కంటే రాజకీయాలను వదులుకోవడమే మేలని నమ్మే వాడినన్నారు. నిరంతరం మంచి కోరే నామీద రాచమల్లు, బంగారురెడ్డి ఎన్ని అవినీతి అక్రమాల గురించి ఆరోపించినా ప్రజలు నమ్మరన్నారు. ఎస్పీ జిల్లాలోని క్రికెట్ బుకీలు, జూదగాళ్ళను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారన్నారు.చట్టానికి ఎవ్వరూ అతీతులు కాదని తప్పు చేసినవాడిని వదిలిపెట్టవద్దని పోలీసులకు స్పష్టంగా చెప్పనన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ వెంకట కొండయ్య, టౌన్ బ్యాంకు ఛైర్మెన్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడోసారీ వాయిదా పడ్డ కొత్తూరు విద్యాకమిటీ ఎన్నికలు

పోరుమామిళ్ల, ఆగస్టు 31 : టీడీపీ, వైసీపీ నాయకుల తీవ్ర పోటీ వల్ల కొత్తూరు విద్యాకమిటీ ఎన్నిక మూడోసారి వాయిదా పడింది. మండలంలోని కొత్తూరు విద్యాకమిటి ఛైర్మన్ ఎన్నికలు ఈ సారి కూడా వాయిదా పడ్డాయి. పోరుమామిళ్ల మండలంలోని కొత్తూరు (సిద్దనకిచ్చాయపల్లె) విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నికల్లో వైసీపీ నాయకులు తీవ్రంగా పోటీ పడడంతో రెండు దఫాలుగా ఈ ఎన్నికలు ఉత్కంఠను రేపాయి. శనివారం అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు నోటీసులు ఇచ్చారు. 18 మంది విద్యార్థులుండగా 13 మంది మాత్రమే మెంబర్లు ఉండడంతో ఏడుమంది వైసీపీకి, ఆరు మంది టీడీపీకి గతంలో నిలవడంతో పోటీ తీవ్రమైంది. అధికారంలో ఉన్నాం కాబట్టి ఈ సారి తమకే వదిలేయాలని గతంలో టీడీపీ నాయకులు డిమాండ్ చేయడంతో వైసీపీ నాయకులు కూడా సంఖ్యాబలం ఎక్కువగా ఉందని తమకే ఇవ్వాలని పట్టుబడడంతో గత రెండుసార్లు ఈ ఎన్నిక వాయిదా పడింది. శనివారం మెంబర్లకు తప్ప మిగతా వారిని ఎవరినీ ఆ పాఠశాల ప్రాంగణంలో ప్రవేశించకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంటిగంట అవుతున్నా గ్రామంలోని పిల్లల తల్లిదండ్రులు ఎవరూ హాజరు కాకపోవడంతో ప్రత్యేక అధికారి కేశవరెడ్డి వాయిదా వేశారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, ఎంఈవో బాల అంకిరెడ్డి పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు బద్వేలు నుంచి కూడా పోలీసు అధికారులు గ్రామానికి వచ్చి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

బద్వేలు రూరల్, ఆగస్టు 31 : సంచార జాతుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీబీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ కోరారు. సంచార జాతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా సంచార జాతి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. కార్యక్రమంలో గురుమూర్తి, నరసింహులు, శ్రీనివాసులు,వెంకటేశ్, పిచ్చయ్య, రవి పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

జమ్మలమడుగు, ఆగస్టు 31: జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 3వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బి.నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాధరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో బ్యాంక్ జోన్, తదితర టెక్నాలజీలకు సంబంధించిన కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని వారు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపైన చదువుకున్నవారు బయోడేటాతో సర్టిఫికెట్లను తీసుకుని జాబ్‌మేళాకు హాజరుకావాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు.

నేటి నుంచి 30 పోలీస్ యాక్టు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 31 : ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో నేటి నుంచి ఈ నెలాఖరు వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలవుతుందని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. దీని ప్రకారం డివిజన్ పరిధిలో ఊరేగింపులు, ధార్నాలు, సభలు నిర్వహించేందుకు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి పొందాలన్నారు.

కొండాపురం..: జమ్మలమడుగు కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సెప్టెంబరు 1 నుంచి 30 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలు విద్యాసాగర్, హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల రోజుల పాటు పోలీసుల అనుమతి లేకుండా గుంపులు, గుంపులుగా ఉండటం, సభలు సమావేశాలు, ర్యాలీలు నిషిద్ధమని వారు తెలిపారు. ఒకవేళ ఇలాంటివి జరుపుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని వారు తెలిపారు.

ధరల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు

బద్వేలు, ఆగస్టు 31: ప్రజలపై నిత్యావసర ధరల భారం తగ్గించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు పేర్కొన్నారు.నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ సెప్టెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. జిల్లా సమితి సభ్యుడు వెంకటరమణ, సుబ్బరాయుడు, రమణయ్య, ఏసన్న, చెన్నయ్య అనిల్ , మధు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ



జమ్మలమడుగు..వికలాంగురాలికి పింఛన్ అందిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ ప్రమోద్‌కుమార్, మైదుకూరు...నెల్లూరు ఐసీయూలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం, ఖాజీపేట, పోరుమామిళ్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

మైలవరం, ఆగస్టు 31: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కూటమిప్రభుత్వం పింఛన్లను లబ్ధిదారులకు ఒక రోజు ముందే పంపిణీ చేశారు. దీంతో ఎన్డీయే కూటమి నేతలు ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు శనివారం తెల్లవారుజాము నుంచే గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేస్తున్నారు. మండలంలో 6540 పింఛన్లు ఉండగా 6232 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శంషాద్‌బాను తెలిపారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ, మండంలో శనివారం పింఛన్ల విజయ వంతంగా నిర్వహించారు. మైదుకూరు మండలంలో 97 శాతం, మున్సిపాలిటీలో 94 శాతం పింఛన్లు పంపిణీ జరిగినట్లు అధికారులు తెలిపారు.మిగిలిన పింఛన్లను సోమవారం పంపిణీ చేయనున్నారు. మండలంలోని అన్నలూరు పంచాయతీ, సోమయాజులపల్లికి చెందిన పెరుగు నరసింహులు నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అన్నలూరు సచివాలయం ఉద్యోగి ఆసుపత్రికి వెళ్లి అతనికి పింఛన్ అందించారు.

ప్రొద్దుటూరు టౌన్..: ఒకరోజు ముందుగానే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ అందజేయడం అభినందనీయమని 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి పేర్కొన్నారు. శనివారం 33వ వార్డులో అర్హులైన వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు.

ఖాజీపేట..: అధికారులు ఉదయం 6 గంటల నుంచి ఖాజీపేట మండల పరిధిలో పింఛన్లు పంపిణీ చేశారు. వర్షాన్ని లెక్కచేయకుండా గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పంపిణీ చేశారు. మండల పరిధిలో 95 శాతం పూర్తి చేశారని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు.

కాశినాయన..: మండలంలోని 17 పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు ఎంపీడీవోమైథిలీ తెలిపారు. శనివారం ఒక్కరోజు 92.6 శాతం పింఛన్లు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలినవి సోమవారం పంపిణీ చేస్తామన్నారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: వర్షం వస్తున్నా కూడా అధికారులు, అధికార పార్టీ నాయకులు పింఛన్లు లబ్ధిదారులకు అందిస్తున్నారు. శనివారం ఉదయం పోరుమామళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ గొడుగులు తీసుకుని పింఛనుదారుల గృహాల వద్దకు వచ్చి పంపిణీ చేశారు. శనివారం దాదాపు 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో బీసీ కాలనీలో తదితర ప్రాంతాల్లో ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ ప్రమోద్‌కుమార్ శనివారం ఉదయాన్నే పెన్షన్ పంపిణీ చేశారు. ఆర్డీవో ఉదయాన్నే పింఛన్ పంపిణీ తనిఖీ చేశారు. అందులో భాగంగా ముందుగా వికలాంగురాలికి ఆర్డీవో పింఛన్ అందజేశారు. వర్షం కురుస్తున్నా సచివాలయ సిబ్బంది, అధికారులు పింఛన్ పంపిణీ చేశారు.

రాజుపాలెం..: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం ఉదయం 6గంటలకే పంపిణీ మొదలుపెట్టారు. టంగుటూరు ఎస్సీకాలనీలో డిజిటల్ అసిస్టెంటు శ్రావణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేశ్ పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 4225 పెన్షన్ ప్రజలకందించినట్లు ఎంపీడీవో తెలిపారు.